తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# సిఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు కలెక్టర్‌చే పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సగిలి

కుప్పం, జూన్ 21 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 25,26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ పరిశీలించారు. ఈసందర్భంగా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులి ్న ఆదేశించారు. కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో హెలిప్యాడ్, ఆడిటోరియాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఎక్కడెక్కడ బ్యారికేడ్లు ఏర్పాటుచేయాలో అధికారులకు సూచించారు. అనంతరం కుప్పం బస్టాండులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహంకు నివాళులు, పుష్పాలంకరణపై అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ఆర్అండ్‌బి అతిథిగృహంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. సిఎం పర్యటించే ప్రతి ప్రాంతంలో ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద సిఎం బసచేయనున్న నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం కుప్పం మండల కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ శాఖలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే 2014-19 కాలం మధ్య పెడింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి డిపిఆర్‌లు రూపొందించాలని సూచించారు. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, డిఎస్పీ శ్రీనాథ్, మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు, తహశీల్దార్ హరికుమార్, కుప్పం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**- ప్రపంచ దేశాలకు యోగా అందించిన ఘనత మనదే - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**


ప్రపంచ యోగ దినోత్సవంలో అసనాలు చేస్తున్న జిల్లా అధికారులు

చిత్తూరు, జూన్ 21 ప్రభాతవార్త: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొంద వచ్చునని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం యోగా దినోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైనందిక జీవితంలో యోగా ఒక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలకు యోగా శాస్త్రంను అందించిన ఘనత బారతదేశంకు దక్కిందన్నారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి, ఆరోగ్య సమస్యలు వున్న వారికి యోగా ద్వారా చక్కటి పరిష్కారం అందుతుందన్నారు. యోగా గురువుల ఆధ్వర్యంలో అసనాలను నేర్చుకొని అవలంబించాలని సూచించారు. యోగాలో లభించే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడానికి యోగా దోహదపడుతుందన్నారు. పివికెఎన్ వాకర్స్ అసోసియేషన్ యోగ బృందం ఓగ గురువులు బాబు, అనులు పలు అసనాలు ప్రదర్శించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఇతరులు అనుసరిస్తూ అసనాలను చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యోగ గురువులకు జిల్లా అధికార యంత్రాంగం తరపున జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డిలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అదికారి బాలాజీ, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, సిపిఓ సాంబశివారెడ్డి, జిల్లా అధికారులు, వారి సిబ్బంది, మహిళలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర జీవితానికి యోగా అనేది మార్గం : ఎస్పీ




ఆరోగ్యకర జీవితానికి యోగా ఒక మార్గమని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరు నగరంలోని సూర్యప్రతాప్ కళ్యాణ మండపంలో ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ఏఆర్ ఎఎస్పీ జి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులతో కలిసి యోగా అసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యోగా ప్రాచీన భారతీయ జీవిత విధానం అని, ఇది శరీరానికి, మనసుకు, ఆత్మకు, ఆరోగ్యానికి, శాంతి, సంతులనం అందిస్తుందన్నారు. యోగా మన శరీరంను, మనసును ఆరోగ్యంగా వుంచుడానికి సహాయ పడుతుందన్నారు. నిత్య యోగా అభ్యాసం ద్వారా వ్యాధులు తగ్గుముఖం పడుతాయని, పోలీసు ఉద్యోగం అనేది అత్యంత ఒత్తిడితో కూడిన వృత్తి అని, నిత్యం తీవ్ర ఒత్తిడికి గురికావడం, ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొవడం, గంటల పాటు పని చేయడం వంటి కారణాలతో పోలీసు సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఈ క్రమంలో యోగా అనేది ఒక గొప్ప సాధనంగా భావించి యోగాలోని అసనాలు, శ్వాస వ్యాయామాలు, ధ్యానం ద్వారా శరీరం, మనస్సును ప్రశాంతంగా వుంచుకోవాలన్నారు. యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గించడం, శారీరక, మానసిక ఆరోగ్యంను మెరుగుపరచుకోవడం, పని సామర్థ్యంను పెంచడంలో కీలక పాత్ర పోషించవచ్చునన్నారు. నిత్య జీవితంలో పోలీసులు యోగా సాధన చేసుకుంటు వెళితే ప్రశాంత జీవితంను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ రఘువీర్, దిశా డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఏఆర్ డిఎస్పీలు మహబూబ్‌భాషా, ఇలియాస్ భాషా, డిటిసి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, భాస్కర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

**భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బిజేపి కో ఇంచార్జి సునీల్ దేవధర్**

గూడూరు, జూన్ 21 ప్రభాతవార్త : మన భారతీయ సంపద అయినటువంటి యోగాను నేటితరం యువతకు తెలియజేసి యువతరానికి యోగా పట్ల అవగాహన కల్పించాలని నరేంద్ర మోడీ నేతృత్యంలో బిజేపి కేంద్ర ప్రభుత్వం యోగాను ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బిజేపి కో ఇంచార్జి సునీల్ దేవధర్ తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బీజేపి కో ఇంచార్జి సునీల్ దేవధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చెడు అలవాట్లు నుండి దూరం అయ్యేందుకు మనలోని ఏకాగ్రతను పెంచేందుకు యోగ దివ్య సాధనంగా ఉపయోగపడుతుందని



సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బీజేపి కో ఇంచార్జి సునీల్ దేవధర్

తెలిపారు. యోగా యొక్క గొప్పతనాన్ని నరేంద్ర మోడీ ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసి జూన్ 21వ తేదిన ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థి దశలో యోగా ద్వారా అద్భుత ఫలితాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగమార్త అరుణాదేవి, రోడ్డు రవాణా శాఖ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి విద్యా సంస్థల చైర్మన్ వంకి, పెంచలయ్య, వివిధ విభాగాలు హెచ్‌వోడిలు తదితరులు పాల్గొన్నారు.

# కుర్చీలు వదలరా!

**పదవీ విరమణ చేసినా మళ్ళీ పోస్టింగ్‌లతో రాజమర్యాదలు**



**ప్రభాతవార్త-తిరుపతి:**

వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవీవిరమణ చేసినా, రాజకీయనేతల అడుగులకు మడుగులొత్తేలా మళ్ళీ ఏదో ఒక పోస్టులో కుర్చీలు వదలకుండా పట్టుకుని కూర్చున్న పదలుసంఖ్యలో ఉన్న వారిని సాగనంపేందుకు చంద్రబాబు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకోసం తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాల ఉత్తర్వులు ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు చేరాయి. దీంతో గత వైసిపి ప్రభుత్వం హయాంలో వైసిపి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు చెప్పిందే వేదంగా మనవాడైతే ఆ కుర్చీల్లో మంచిదని భావించి అటు తమ పబ్బం గడుపు కోవడానికి ఇటు రకరకాల హోదాల్లో కూరోక్చబెట్టిన ఆ అధికారులతో మిలాకత్ కావడానికి సులభమైంది. ఇలా 2019-24వరకు యధేచ్ఛగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇదే తంతు నడిచింది. తాజాగా పదవీవిరమణ చేసిన అధికారులు, ఉద్యోగులు ఎవరైనా ఏదేని హోదాలో పనిచేస్తున్నా తక్షణమే రాజీనామా చేసి వైదొలగాలని ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఇప్పటివరకు రాజభోగాలు, రాజమర్యాదలు అనుభవించిన పలువురు అధికారులు, ఉద్యోగులు కుర్చీలు వదలివెళ్ళడానికి ససేమిరా అనడమేగాక కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మారిన చంద్రబాబు 4.0పాలనను చూస్తారని బహిరంగంగానే అటు అధికార యంత్రాంగానికి ఇటు ప్రజా ప్రతినిధులకు మీడియా సమక్షంలో వెల్లడించిన విషయం విదితమే. అంతేగాక గత ఐదేళ్ళ వైసిపి అరాచక పాలనలో అన్నీ తామై అంటకాగిన కొందరు పదవీ విరమణ చేసిన తెల్ల ఏనుగుల్ని ఇప్పుడు బయటకు పంపేందుకు సిద్ధమైంది. ఇందుకు తగిన ఉత్తర్వులు కూడా వెలువడటంతో చేసేది లేక తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య భారతి, ధార్మిక సంస్థలోని టిటిడి అన్నప్రసాదం విభాగంలో జివిఎల్ఎన్ శాస్త్రి, మార్కెటింగ్ విభాగంలో రామరాజు, శివప్రసాద్, మార్కెటింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో ఇలా పలువురు అధికారులు పదవీవిరమణ అనంతరం కూడా పలు రకాల హోదాల్లో యధేచ్ఛగా తమ జీవితం గడుపుకుంటున్నారు. ఇప్పుడు వీరందరినీ సాగనం పేందుకు ప్రభుత్వం కార్యాచరణతో సిద్ధమైంది. రానున్న సోమవారంనాటికి తెల్ల ఏనుగుల్ని బయటకు పంపడం ఖాయమని అన్ని ప్రభుత్వశాఖల్లో హాట్ టాఫిక్‌గా మారింది.

# గరుడ వాహనంపై శ్రీనివాసుని విహారం

వడమాలపేట, జూన్ 21 ప్రభాతవార్త: బ్రహ్మోత్సవాల్లో తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుని భక్తులు తనివి తీరా తిలకించి పులకించారు. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి గరుడ వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జామున 4 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవదానవులకు అమృతం పంచిపెట్టేందుకు శ్రీ మహావిష్ణువు మోహినీ రూపంలో అవతరించారట. భక్తజన వల్లభుడైన శ్రీవారు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాహనానికి ముందు భక్తులు కోలాటాలు, భజనలతో ఆడుతూ, పాడుతూ స్వామివారి సేవలో తరించారు. గరుడ వాహనం సందర్భంగా టీటీడీ అధికారులు తిరుమల నుంచి లక్ష్మీకాసుల హారాన్ని తీసుకువచ్చిన పూజలు నిర్వహించారు. మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారి గరుడ వాహన సేవను తిలకించేందుకు వేలాది మంది తరలి రావడంతో అప్పలాయగుంట భక్తజనంతో నిండిపోయింది. భక్తులు గోవింద నామస్మరణల మధ్య ముందుకు సాగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు, కోలాటాలు, నృత్యాలు, వాయిద్యాలతో అప్పలాయ గుంట మారుమోగింది. ఈ కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవోరమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారా చార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.




గరుడ వాహనంపై విహరిస్తున్న మలయప్ప, మోహినీ అవతారంలో పల్లకిలో శ్రీనివాసుడు

# శ్రీసిటీని సందర్శించిన తిరుపతి ఎస్పీ



సత్యవేడు, జూన్ 21 ప్రభాతవార్త: తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు గురువారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. మొట్ట మొదటి సారిగా శ్రీసిటీకి విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు ఇక్కడ అనుసరిస్తున్న భద్రతా విధానాలను వివరించారు. శ్రీసిటీ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు సరిహద్దులో ఉన్నందు, డ్రగ్స్ రవాణా, అక్రమ మద్యం తరలింపు, స్మగ్లింగ్ వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు ఇక్కడ ఆస్కారం ఉందంటూ డాక్టర్ సన్నారెడ్డి ఎస్పీకి వివరించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, విద్యార్థులు విదేశీ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉన్న శ్రీసిటీలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ శ్రీసిటీ పరిసరాలను చుట్టి చూశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి శాంతిభద్రతలపై సమీక్షించారు. శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్, శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం జనరల్ మేనేజర్ రమేష్ తదితరులు ఎస్పీ వెంట పర్యటనలో పాల్గొన్నారు.

**ఐఏఎస్‌లను రప్పించి సంస్కరిస్తారా?**

# శ్రీకాళహస్తీశ్వరాలయ కొత్త ఇఓ ఎవరు?

**శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదాయ స్థాయిని బట్టి దేవాదాయశాఖ వద్ద ఉన్న ఆదాయ గణాంకాల మేరకు రీజినల్ జాయింట్ కమిషనర్ లేదా స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్ స్థాయి అదికారులు ఇఓగా ఉండాలి. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖలో ఆ అర్హతలున్న ఇఓలు లేదు కాబట్టి ప్రభుత్వం, రెవెన్యూశాఖ నుంచి దిగుమతి చేసుకొని ఇక్కడ ఇఓలుగా నియమిస్తున్నారు. దేవాలయాల్లో దేవుడిని సొమ్మును అందినకాడికి దోచుకోవడం, అంతకు మించిన హోదా అనుభవించడం ఇఓలకు పరిపాటిగా మారింది. ఆలయం లోపల కాని, నాలుగు మాడా వీధుల్లో పర్యటించి భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టే ఇఓలు ఇప్పటి వరకు రాకపోడం దురదృష్టకరంగా మారింది. ఎసీ గదులకు అలవాటుపడి, భక్తుల బాధలు తెలియక, రాజకీయ నాయకులపై స్వామి భక్తికి ప్రదర్శంచి, గుడిలో స్వామిని మరచిపోతూ, భక్తు అవసరాలను విస్మరిస్తూ, ఫైల్‌పై సంతకాలు చేస్తూ, వచ్చిన కమిషన్‌ను తీసుకోవడానికే సరిపోతుంది. అర్హత, ఆలయాల్లో పని తీరు తెలియని అధికారులు రావటం వారికి ఇక్కడి ఆచార వ్యవహారాలు సంప్రదాయాలపై అవగాహన లేక పోవటంతో ఇక్కడ స్థానికంగా ఉన్న ఉద్యోగుల సూచనలు, సలహాలతో ఫైళ్లు కదులుతున్నాయి. అంతకుమించి ఇక్కడ ఇఓలుగా వచ్చిన అధికారులు 'రాజకీయ నాయకుల ఆదేశాలను జీ హుజూర్'అంటూ ఆచరించటంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. గతంలో శ్రీకాళహస్తిని పరిపాలించిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈ ఆలయానికి ఎలాగైనా ఐఏయస్ అధికారిని నియమించుకొని సంస్కరణలు అమలు చేయాలని ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. ఆయన తనయుడు అయినా ఆ కలను సాకారం చేస్తారా? వేచి చూడాలి.**

**శ్రీకాళహస్తి,జూన్ 21 ప్రభాతవార్త**



ఈ నెల 30న ఇక్కడ పని చేస్తున్న ఇఓ ఉద్యోగ విరమణ చేయనున్నారు. అయితే ఇక్కడ పరిపాలనను గాడిలో పెట్టగల సమర్థుడైన అధికారి కావాలి.కానీ గతంలో ఇక్కడ పని చేసిన ఇఓలు స్థానిక నాయకుని కుటుంబసభ్యుల వద్దకు వెళ్ళి అప్పుడే పైరవీలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం ఒక నాడు ధూప దీప నైవేద్యాలకు నిధుల్లేకుండా దాతల ఔదార్యంతో సాగేది. నేడు ఆలయానికి ఏటా సుమారురూ.250కోట్లు ఆదాయాలు వస్తున్నాయి. ఇందులో రూ.130కోట్లకు పైగా రాహుకేతుదోష నివారణ పూజల ద్వారా వస్తుంది. అంతకు రెట్టింపు పూజారులు, దళారులు, సిబ్బంది అధికారుల జేబుల్లో చేరుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం ఒక నాడు ధూప దీప నైవేద్యాలకు దాతల మీద ఆధారపడాల్సిన దుస్థితి నేడు భక్తులు విభూదీశునికి కోట్ల రూపాయల్లో విరాళాలు అందిస్తున్నారు.పాములే హారాలుగా ధరించిన భోళాశంకరుడు నేడు బంగారు ఆభరణాలతో కళ కళ లాడుతున్నాడు. అయితే ఇక్కడ స్వామి అమ్మవార్ల ఆదాయాలతో పాటు మధ్యవర్తుల ఆదాయాలు కూడా జేబులు నింపుతున్నాయి. దాంతో ఇక్కడ ఉద్యోగానికి ఓ రేటు ఖరారు చేసి వేలం పాడుకుంటున్నారంటే ఎంత ఆదాయాలు వస్తునాయో? అర్థమౌతుంది.ఇక ఆలయానికి సంబంధించిన భూములకు రక్షణ లేదు.పనుల్లో పారదర్శకత లేదు.గత కొన్ని సంవత్సరాలుగా టెండర్ల ముసుగులో నామినేషన్ పనులు సాగుతున్నాయి.అభివృద్ధి ముసుగులో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడకు వచ్చే రెవెన్యూశాఖకు సంబంధించిన అధికారులు కేవలం ఫైళ్ల మీద సంతకాలు చేయటానికే పరిమితమౌతున్నారు.ఎంత నిజాయితి పరుడైన అధికారి వచ్చినా ఇక్కడ కొందరు ఉద్యోగులు ఆతన్ని కాసుల మైకంలో ముంచెత్తున్నారు. దాంతో పరిపాలన గాడి తప్పింది. సంస్కరణలు అమలు చేయాల్సిన స్థాయిలో దళారుల వ్యవస్థను పెంచిపోషించారు.మరి ఈ వ్యవస్థను పూర్వపు స్థితికి తీసుకురావాలంటే ఓ ఐఏయస్ అధికారి రావాలి. అదే గతంలో గోపాలకృష్ణారెడ్డి ప్రయత్నం.

**ఆదాయాలకు అనుసరించే స్థాయి అధికారి ఉండాలి!**

దేవాదాయశాఖలో ఆదాయాలను అనుసరించి స్థాయిని నిర్ణయిస్తారు. గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పరిపాలనలో ఓ సారి ట్రైనీ ఐఏయస్ అధికారిని తీసుకురావటానికి విఫల యత్నం చేసారు. గత ఐదేళ్ళుగా సాగర్‌బాబు, రామారావు లాంటి అధికారులు ఇఓలుగా పని చేసినా పరిపాలన చక్కబడలేదు.

**ఆలయ పాలన అస్తవ్యస్తం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వందల కోట్లలో ఆదాయాలు వస్తున్నాయి. కానీ అంతకు మించి సమస్యలు చోటు చేసుకున్నాయి. ఆలయంలో దళారుల దందా, పూజలు, ఆచార వ్యవహారాల్లో పారదర్శకత లేదు. పూజలు అభిషేకాల్లో సంప్రదాయాలకు తిలోదకాలు. ఇక ఆలయానికి సంబంధించిన భూ వివాదాలు ఏళ్ళ తరబడి కోర్టుల్లో నలుగుతుంది. దేవస్థానం ఆస్తుల అన్యాక్రాంతం ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ కోసం ఇప్పటికే దేవస్థానం సుమారు రూ.వంద కోట్లకు పైగా వెచ్చింది. కానీ ఆచరణకు నోచుకోలేదు. గత తెలుగుదేశం హాయంలో రూపకల్పన చేసిన మాస్టర్ ప్లాన్ ఐదేళ్ళలో ఒక్క ఇంచి కూడా ముందుకు సాగలేదు. ఇక్కడ పరిపాలన గాడిలో పడాలంటే ఐఏయస్ స్థాయి అధికారి రావాలి. గతంలో ఇక్కడ పనిచేసిన వారికే మళ్ళి అవకాశం ఇస్తే యథాస్థితిగా మారుతుంది. అయితే అభివృద్ధికి సంబంధించి ఓ ప్రణాళికా బద్దంగా నడవాలనుకుంటున్న శాసనసభ్యుడు 6 నెలల్లో మార్పుచేస్తారని చెబుతున్నారు. ఆయన మదిలో ఏం ప్రణాళికలున్నాయో ఆచరణకు వస్తే కానీ తెలియదు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా

**చిత్తూరు, జూన్ 21 ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15 మందికి శుక్రవారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున మొత్తం 1.50 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. చిత్తూరు నగర డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు గురువారం సాయంత్రం మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి శుక్రవారం వారిని కోర్టుకు హాజరు పరిచారు. ఈ మేరకు విచారించి ప్రిన్సిపల్ సీనియన్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ ఏడు నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 235 మందిని పట్టుకొని కోర్టుకు హాజరు పరచడంతో కోర్టు వీరికి 17.50 లక్షల రూపాయల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు పేర్కొన్నారు.

## వెంకటాపురంలో ప్రబలిన అతిసారా.. నలుగురు ఆస్పత్రిపాలు

కుప్పం(గుడుపల్లె), జూన్ 21 ప్రభాతవార్త : గుడుపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో అతిసార ప్రబలింది. గ్రామంలో పలువురు విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రి పాలయ్యారు. గ్రామానికి చెందిన నలుగురిని చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా గ్రామంలో పలువురికి నీళ్లతో కూడిన విరేచనాలు కావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న గుడుపల్లె పిహెచ్‌సి డా॥ డెల్ఫిన్ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేయించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను చేయించారు. కలుషిత జలాలు తాగి ఏమైనా అతిసార ప్రబలిందా అనే కోణంలో అనుమానిస్తూ శుక్రవారం గ్రామీణనీటిపారుదల శాఖ అధికారులు గ్రామంలో నీటి శాంపుళ్లను సేకరించి తిరుపతిలో ఉన్న ల్యాబ్‌కు పంపారు. ఈ నివేదిక వస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయి. ఈవిషయంగా డాక్టర్ డెల్ఫిన్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా నలుగురు మంది కుప్పం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. మూడు రోజుల పాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రమాణ స్వీకార సంబరాలు



**శ్రీరంగరాజపురం, జూన్ 21 ప్రభాతవార్త:** నూతన అసెంబ్లీ సమావేశాల్లో గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన డాక్టర్ థామస్ శుక్రవారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడంతో కొత్తపల్లిమిట్ట గ్రామంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ థామస్ 27 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి తమ ఆనందంను వెల్లిబుచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లిమిట్ట తెలుగుదేశం నాయకులు సూరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అజిత్, నవీన్‌రెడ్డి, యోగినాయుడు, జ్యోతి స్వరణ్, దుర్గా శంకర్, సాయి, తయ్యూరు సురేష్, గుండయ్య, సిద్ధు, సతీష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అతిసారా పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంపులు

**పాలసముద్రం, జూన్ 21 ప్రభాతవార్త:** పాలసముద్రం గంగజాతర సందర్భంగా అంబలి సేవించి అతిసార ప్రబలడంతో వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరిన ప్రజల పరిస్థితి ప్రస్తుతం మెరుగుపడింది. గ్రామంలో పరిస్థితి మెరుగుపడటంతో అతిసార పూర్తిగా అదుపులో వచ్చే వరకు గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రతి ఒక్కరికి వైద్యం చేస్తామని పిహెచ్‌సి డాక్టర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్ కావడంతో ప్రజలకు వాంతులు, విరేచనాలు అయ్యాయని, ప్రస్తుతం అదుపులోకి రావడంతో పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఎంపిడిఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ పాలసముద్రంలో అతిసారా ప్రబలడంతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించి మెడికల్ క్యాంపులు నిర్వహించి పరిస్థితిని అదుపులోకి తెచ్చిందన్నారు. అతిసార అదుపులోకి తీసుకురావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి అయన ధన్యవాదాలు తెలిపారు.

## ఉపాధి సిబ్బందితో యోగాసనాలు



**యాదమరి, జూన్ 21 ప్రభాతవార్త:** ప్రపంచ యోగా దినోత్సవంను పురస్కరించుకుని గ్రామీణ ఉపాధిహామీ అధికారులు శుక్రవారం మండల ఉపాధి సిబ్బంది, కూలీలతో బుడితిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మించిన అమృత్ సరోవర్ కుంట సమీపంలో యోగాసనాలు చేశారు. డ్వామా పిడి రాజశేఖర్, చిత్తూరు క్లస్టర్ ఎపిడి సుబ్రమణ్యం ఉపాది సిబ్బందితో యోగాసనాలు చేసి ప్రపంచ యోగా దినోత్సవం విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా డ్వామా పిడి రాజశేఖర్ అమృత్ సరోవర్ కుంట ప్రక్కన వున్న రైతు ఆనంద్ పొలంలో ఫామ్‌పండ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రం అధికారి బాలా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమ్య, టెక్నికల్ అసిస్టెంట్ మధు, కస్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ డిస్టిక్ జోన్ చైర్ పర్సన్‌గా మారసాని

**పాకాల, జూన్ 21, ప్రభాతవార్త :** త్వరలో పాకాలలో డయాబెటిక్ కేర్ సెంటర్ ప్రారంభించనున్నట్లు లయన్స్ క్లబ్ డిస్టిక్ జోన్ చైర్ పర్సన్ మారసాని విజయబాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ 317 ఈ జోన్ చైర్ పర్సన్‌గా తనకు అవకాశం దక్కడం సంతోషకరమన్నారు. తన సేవలను గుర్తించి పదోన్నతిని కల్పించిన చంద్రాహెచ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జోన్ చైర్ పర్సన్‌గా తనకు అప్పగించిన మూడు క్లబ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు.

## సదుం ఎంపీపీ ఎల్లప్ప ఆకస్మిక మృతి!

సదుం జూన్ 21 ప్రభాతవార్త :

సదుం మండల పరిషత్ అధ్యక్షుడు బి.ఎల్లప్ప(72) శుక్రవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు. శుక్రవారం తెల్లవారుజామున ఆయన స్వగ్రామం నడిగడ్డపం చాయతీ చిచ్చిలివారి పల్లెలో నిద్రిస్తుండగా హఠాత్తుగా ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది పడ్డారు. వెంటనే బంధువులు ఆయనను సదుం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రధమ చికిత్స అందిస్తుండగా ఆయన ఊపిరి ఆగిపోయింది. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. అంతకు ముందు ఆయన భార్య కృష్ణమ్మ నడిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచిగా సేవలు అందించారు. ఆయన భౌతిక కాయానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైకాపా నాయకులు కార్యకర్తలు వచ్చి దర్శించి నివాళులు అర్పించారు. ముఖ్యంగా చిత్తూరుమాజీ ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటస్వామి, పెద్దిరెడ్డి ఇందిరమ్మ ,జడ్పీటీసీ సభ్యుడు సోమశేకరరెడ్డి,వైకాపా యువనా యకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డి, మల్లికార్జున,రెడ్డెప్పరెడ్డి, సయ్యద్‌భాషా, ఖమురుద్దీన్, సోమల నాయకులు నాగేశ్వరరావు, ఆమాసమో హన్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.



## కొమరగుంట సచివాలయంకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు

**వెదురుకుప్పం, జూన్ 21 ప్రభాతవార్త :** కొమరగుంట సచివాలయంకు తెలుగు దేశం పార్టీ నాయకులు శుక్రవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు. డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్‌ల చిత్ర పటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి ఎన్.ముని చంద్రా రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరమణా రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జీ కోనేరు చంగ్రలాయ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు మునిక్రిష్ణ సుధాకర్ రెడ్డి, గురునాధం లలిత, చంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## జీవితాన్ని ఆధీనంలోకి తెచ్చుకొనేదే యోగా : జయప్రకాష్

**చౌడేపల్లి, జూన్ 21 ప్రభాతవార్త :** జీవితాన్ని మన ఆధీనంలోకి తెచ్చుకోవడమే యోగా అని ప్రిన్సిపాల్ జయప్రకాష్ అన్నారు. శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి ఆసనాలు వేయించారు. మానసిక ఉల్లాసం, శరీరదృఢత్వం, జ్ఞాపకశక్తి పెరుగుదల వంటివి యోగాతోనే సాధ్యమని ఎన్ఎస్ఎస్ కార్యనిర్వాహకుడు బాలాజీ అన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన 'గురజాల' జగన్మోహన్

**చిత్తూరురూరల్, జూన్ 21 ప్రభాతవార్త:** నేడు ప్రారంభమైన అసెంబ్లీ సమావేశంలో చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా 'గురజాల జగన్మోహన్ అనే నేను' అంటూ జగన్మోహన్ నాయుడు ప్రమాణం స్వీకారం చేయడంతో ఆయన అభిమానులు సంతో షంతో కేరింతలు కొట్టారు. ఆయన చిత్తూరు అభివృద్ధికి కష్టపడి చేస్తానని, ఇచ్చిన మాటకు కట్టుబడి వుంటానని తెలపడంతో నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేసా రు. అలాగే చిత్తూరులోని పార్టీ కార్యాలయం, ఇంటి ఆవరణం ముందు పార్టీ నాయ కులు,అభిమానులు భారీగా బాణా సంచా పేల్చుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసిన రమేష్‌బాబు



పాలసముద్రం, జూన్ 21 ప్రభాతవార్త: జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ డి.రమేష్‌బాబు శుక్రవారం విజయవాడలోని పిసిసి కార్యాలయంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను మర్యాద పూర్వకంగాకలిశారు.జిడినెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ డి.రమేష్‌బాబు నియోజకవర్గంలో కాంగ్రెస్ స్థితిగతులను వివరించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి ముందుకు వెళ్లాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డి.రమేష్‌బాబును కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థులకు పాఠ్య..నోట్‌పుస్తకాలు పంపిణీ



**రామకుప్పం, జూన్ 21 ప్రభాతవార్త :** మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం తరపున ఉచితంగా పాఠ్య,నోట్ పుస్తకాలను మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర నేత మునస్వామి తదితరులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు తగు నివేదికలు అందిస్తామన్నారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, రామూర్తి, చిన్నికృష్ణ, రఫీ, ఆనందప్ప, పెరుమాళ్, కేశవరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కుప్పంరూరల్/శాంతిపురం/రామకుప్పం,జూన్ 21 ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కుప్పం,శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఘన ంగా నిర్వహించారు. కుప్పం ఎంఎఫ్‌సి జూనియర్ కాలేజ్‌లో యోగాసనాలు వేసి విద్యార్థులకు యోగాపై వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ మహబూబ్ బాషా, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి తులసినాథ్, గుడుపల్లె అధ్యక్షుడు రామచంద్రుడు, బిజెవైఎం అధ్యక్షుడు పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే శాంతిపురం మండలం సోగడబళ్ల గ్రామంలోని పాఠశాలలో యోగాపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు కాశీనాథ్, జిల్లా నేత గజేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే పరమహంస యోగానంద గురుకులంలో సైతం అంతర్జాతీయ యోగా దినోత్సవంను జరిపారు. స్వామిశుద్ధానందజీ, బ్రహ్మచారి శ్రీస్వామి నిరంజనానంద్‌జి, విద్యాలయ ఛైర్మన్ గోపాల్ అగర్వాల్ పాల్గొని యోగా ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు చక్రపాణిరెడ్డి, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, నారాయణశెట్టి, చంద్రశేఖర్, గణపతిశాస్త్రి, కోదండప్ప పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అనధికార నియామకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**కుప్పం, జూన్ 21 ప్రభాతవార్త :** కుప్పం మున్సిపల్ పరిధిలో ఎన్నికలకు ముందు అధికారికంగా ఎలాంటి అర్హత లేని 16మందిని కార్యాలయ సిబ్బందిగా నియమించుకున్నారని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్‌కు శుక్రవారం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం నేతృత్వంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు జిమ్‌దాము, సురేష్, జాకీర్ తదితరులు ఫిర్యాదు చేశారు. కుప్పం మున్సి పాలిటీలో అప్కాస్ ద్వారా సుమారు 126మంది సిబ్బంది కొనసాగుతున్నా రన్నారు. వీరికి ఏటా 3.60కోట్ల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. మున్సిపాలిటీకి అంత ఆదాయం లేదని ఈ నేపథ్యంలో అర్హత లేని సిబ్బంది నియామకాలు రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్,

## ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి : కమీషనర్



**కుప్పంరూరల్, జూన్ 21 ప్రభాతవార్త :** మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా కుప్పంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలు నీటి నిల్వలు శుభ్రపరచుకుని దోమల లార్వాలు పెరగకుండా డ్రైడేగా పాటించాలని కోరారు. అలాగే దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో మందులు పిచికారీ చేసి దోమల నిర్మూలన చేపట్టాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులురెడ్డి, యాంటీ ప్లేగ్ సూపర్‌వైజర్ రంగస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఆరోగ్యకార్యదర్శి నవరత్న, శానిటరీ సెక్రటరీ హరినాథ్ పాల్గొన్నారు.

## బేటి బచావో బేటి పడావో

**పాకాల, జూన్ 21 ప్రభాతవార్త :** పాకాల మండలంలో చంద్రగిరి ప్రాజెక్టు దామలచెరువు సెక్టార్ రమణయ్యగారి పల్లి పంచాయితీలో అంగన్‌వాడి కేంద్రంలో భేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం దేశం ఆడపిల్లలను రక్షించండి ఆడపిల్లల్ని చదివించండి కార్యక్రమంలో సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం విద్య సామాజిక ఎదుగుదల ద్వారా ఆడపిల్లల అభివృద్ధి సాధించడం జరుగుతుందని సెక్టార్ సూపర్వైజర్ కృష్ణ వేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యువరాజులు, అంగన్‌వాడి టీచర్ రేవతి, ఏఎన్ఎం ఆశా వర్కర్లు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## యోగా సాధనతో మానసిక ప్రశాంతత

కోట,జూన్ 21 ప్రభాతవార్త :



ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు ఉరుకులు పరుగుల జీవితం ఒత్తిళ్లు, పని భారం చిన్న విషయాలకూ మానసిక వేదన... ఏకాగ్రత, ఆత్మస్థైర్యాన్ని తదితరాలతో వ్యాధుల బారిన పడుతున్నారని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్, వరదరెడ్డి విజయకుమార్‌రెడ్డి అన్నారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని జయించడానికి, వ్యాధులను దూరం చేయడానికి యోగా ఓ సంజీవనిలా పని చేస్తుందన్నారు. ఈ యోగా కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులు 600 మంది ఆపాల్గొనక క్యాప్ కమాండట్ గణేశ్, ఎన్‌సిసి అధికారులు మల్లికార్జున్ రెడ్డి, నరేంద్రబాబు, పెంచలరెడ్డి, కోండారెడ్డి, మస్తానయ్య, నరేష్, అనిల్ కుమార్,వెంకటేష్, యోగా క్లబ్ క్లబ్ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## మూడోసారి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 21 ప్రభాతవార్త :



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మూడోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. 2009, 14వ సంవత్సరంలో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో మూడోసారి శాసన సభ్యులుగా ఆయన గెలుపొందారు. అసెంబ్లీలో ఆయన మూడోసారి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, సీనియర్ న్యాయవాది రమణారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు,ఎమ్మెల్యేగా రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయడంతో శుభాకాంక్షలు తెలిపారు.

## యోగా ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చు

వెంకటగిరి, జూన్ 21 ప్రభాతవార్త :



యోగ ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండొచ్చని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్‌నాయుడు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వెంకటగిరిలోని బిజెపి కార్యాలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ఒత్తిడిని కూడా జయించొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు యోగేశ్వర నాయుడు, దశయ్య పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా విష్ణుమూర్తి చెంచులక్ష్మి అమ్మవార్ల వార్షికోత్సవం

వెంకటగిరి, జూన్ 21 ప్రభాతవార్త :



ఆముదూరు గ్రామం వద్ద కొలితోటలో వెలసి ఉన్న విష్ణుమూర్తి చంచమ్మ అమ్మవార్ల 18 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. విష్ణుమూర్తి చెంచుమహాలక్ష్మి అమ్మవార్లను వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. చెంచు మహాలక్ష్మి అమ్మవారి జీవిత చరిత్ర నాటకం అందర్నీ ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఈవో ఆర్వభూమి శ్రీనివాసులు రెడ్డి గ్రామస్తుల సహకారంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. 18 సంవత్సరాల నుండి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

## కాదలూరులో భూసార పరీక్షలు

**తడ, జూన్ 21 ప్రభాతవార్త :** తడ మండలం కాదలూరులో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించారు. మట్టి నమూనా సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్ఎన్ కాంచన, విఏఏ విజయలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రాక్షస పాలనకు ప్రజలు చమర గీతం పాడారు

వెంకటగిరి, జూన్ 21 ప్రభాతవార్త :

రాష్ట్రంలో రాక్షస పాలన పోయిందని మాజీ ఏఎంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వర రావు తెలిపారు. ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయడంతో వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కురుగొండ్ల రామకృష్ణ మూడో సారి ఎమ్మెల్యేగా విజయం సాధించి రికార్డు సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బి రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి విశ్వనాథం, నాయకులు నర్సింహులు, ఆనంద్, సురేష్ వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రమాణ స్వీకారం

కోట, జూన్ 21 ప్రభాతవార్త :



గూడూరు శాసన సభ్యులు డా.పాశిం సునిల్ కుమార్ రెండువ సారి శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో కోటలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న బాణ సంచా కాల్చిరు.ఈ సందర్భంగా తెదేపా తిరుపతి పార్లమెంట్ మెనార్టీ సెల్ అధ్యక్షులు షెక్. జలీల్‌అహ్మద్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా శాసన సభ్యులు పాశం సునిల్ కుమార్ ఆధర్యంలో నడుచుకుంటామన్నారు. అనంతరం మండల కన్వీనర్ ఎం,సర్వత్తమ్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని సునిల్ కుమార్ రాష్ట్రంలోని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతూ ఆదిశగా తొలి అడుగు వేయడం జరుగుతుందన్నారు.ఈ ఈ కార్యక్రమంలో తిరుపతి తెదేపా జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి, తీగల సురేష్‌బాబు,తెదేపా జిల్లా కార్యదర్శి,తూపిలిరాదకృష్ణారెడ్డి,ఎస్‌సెల్‌నాయకులు,మర్రిపోలయ్య,వెంకన్నపాళెంసర్పంచ్ కె,మదుయాదవ్,కోట పట్టణ అధ్యక్షులు షెక్.షంషద్దీన్ ,నౌషద్, ఎంపిటిసి డి.సురేష్,బాబు పోలమ్మ,పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాలి

గూడూరు, జూన్ 21, ప్రభాతవార్త :



ఎన్నో అవకతవకలు జరిగిన నీట్ పరీక్షను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ ఎలిజిబుల్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలు అనేక అవుతావుకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో దేశ వ్యాప్తంగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూలా చంద్ర శేఖర్, వేషయ్య, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

గూడూరు, జూన్ 21 ప్రభాతవార్త :

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గూడూ రు పట్టణంలోని పలు విద్యా సంస్థలలో అంతర్జా తీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించి విద్యార్థులకు యోగ యొక్క విశిష్టతనను భారతదేశానికి యోగాకు ఉన్న సంబంధాన్ని వివరించారు. యోగ శిక్షణ ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రపంచ దేశాలకు గుర్తించాలని పేర్కొన్నారు. అదే విధంగా గూడూరు రెండో పట్టణంలోని మిని గురుకులంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మయూరి శ్యామ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో విద్యార్థులు ఏకాగ్రతను పెంపందించుకోవచ్చు అన్నారు.



## దళితుడు పై దాడి చేయడం దారుణం

**గూడూరు, జూన్ 21 ప్రభాతవార్త :** గూడూరుకి పొట్ట చేత పట్టుకొని కూలీ పనికి వచ్చిన దళిత కులానికి చెందిన బల్లవోలు నారాయణపై దాడి చేసిన ఎస్కె కాలేషా పై పోలీసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం 21వ తేది రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో గూడూరు డివిజన్ కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, జోగి శివకుమార్ కె. శ్రీనివాసులు ఫిర్యాదు చేసారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

– కార్మికుని దుర్మరణం

తడ, జూన్ 21 ప్రభాతవార్త :



తడ మండలం కాదలూరు సమీపంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని అపాచీ కార్మికుడు మృతిచెందాడు. తడ మండలం మాంబట్టు అపాచీ బస్సును అదే కంపెనీలో పనిచేస్తున్న యువకుడు మోటార్‌సైకిల్‌పై వెళ్లి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తడ పోలీసుల కథనం మేరకు, వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బైనా వంశీ (28) అనే యువకుడు ఈ ప్రమాదంలో మృతిచెందాడు. బస్సు టైర్ల కింద పడి మృతిచెందిన తోటి కార్మికుని చూసి వందలాది కార్మికులు చలించిపోయారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. యువకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోను యోగా దినోత్సవం

తడ, జూన్ 21 ప్రభాతవార్త :



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లోను కార్యక్రమాలు నిర్వహించారు. అక్కంపేటలోని ఏపీ మోడల్ పాఠశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఎంఇఓ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ సౌజన్య, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు. తడ మండల బిజెపి ఆధ్వర్యంలో యోగాసనాలు కార్యక్రమం నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షుడు రాచర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. తడకు సమీపంలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలోను ఘనంగా యోగా దినోత్సవం నిర్వహించారు.

## ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారానికి వెళ్లిన టిడిపి నాయకులు

తడ, జూన్ 21 ప్రభాతవార్త :



తడ మండల పరిధిలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లారు. ప్రత్యేకించి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రమాణ స్వీకారం తిలకించేందుకు ఇక్కడి నుంచి కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, పళణి, రామాపురం సర్పంచ్ టికె శ్రీనివాసన్, ఎం.సుదర్శన్‌రావు, ఏకాంబరం, జయపాల్ తదితరులు ఈ కార్యక్రమానికి వెళ్లారు. నెలవల విజయశ్రీ ప్రమాణ స్వీకార దృశ్యాలను సూళ్లూరుపేట నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు వైరల్ చేశారు. ఏ మాత్రం తడబడకుండా నూతన ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయడాన్ని పలువురు గుర్తు చేశారు.

## తిరువణ్ణామలైలో దేశం నేతల మొక్కుబడులు చెల్లింపు



రామకుప్పం, జూన్ 21 ప్రభాతవార్త :

రాష్ట్రానికి మరలా చంద్రబాబునాయుడు సిఎం కావడంతో మండలానికి చెందిన పలువురు దేశం నేతలు తమిళనాడులోని తిరువణ్ణామలై ఆలయం వద్ద మొక్కుబడులు చెల్లించుకున్నారు. శుక్రవారం 14కి.మీ.ల ఏర గిరి ప్రదక్షిణ చేయడంతో పాటు టెంకాయలు పగల గొట్టి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో నేతలు మనోహర్, గిరిదాసు, శంకర్, రవికుమార్, మోహన్, వేణు, కృష్ణ పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్

చిత్తూరు, జూన్ 21 ప్రభాతవార్త:

శాసనసభలో శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళీమోహన్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ మేరకు నూతన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కావడంతో ఎమ్మెల్యేగా హాజరైన డాక్టర్ మురళీమోహన్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం

**కాణిపాకం, జూన్ 21 ప్రభాతవార్త:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో శుక్రవారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. సత్య నారాయణ స్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## కమనీయం కోదండరాముడి కళ్యాణం

**తవణంపల్లె, జూన్ 21 ప్రభాతవార్త:**

మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈకార్యక్రమానికి గళ్ళావాళ్ళపూరుకు చెందిన రామచంద్రనాయుడు, హైదరాబాద్‌కు చెందిన ఎస్.భాస్కర్‌రెడ్డిలు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే ఆలయంలో ఉదయం శివశంకర్‌రెడ్డి, ఎన్.శరవణభవరెడ్డి, కరుణాకం రెడ్డిలు ఉభయదారులుగా తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర ్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేవీబీపురంలో టీడీపీ, జనసేన నాయకులు సంబరాలు

**కేవీబీ పురం, జూన్ 21 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కేవీబీ పురంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు అందరూ సమైక్యంగా కలసి బ్యాండ్ వాయిద్యాలతో టపాకాయలు పేలుస్తూ సంబరాలు చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నేడు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసినందుకు మూలం చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగిస్తూ ఆదిమూలం నాయకత్వం వర్ధిల్లాలని జై కొట్టుకుంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పరందామిరెడ్డి, చెంగారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు శివరావు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారి ఊరేగింపు

**కేవీబీ పురం, జూన్ 21 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కేవీబీ పురంలో వెలసిన ఓంశక్తి అమ్మవారి విగ్రహాన్ని రాత్రి విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి మేళతాళాలు మధ్య పురవీధుల్లో ఊరేగించారు. ఓంశక్తి అమ్మవారి పూజారి నారాయణ భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మహిళలకు పసుపు కుంకాలు అందించారు.

## ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానించిన టీడీపీనాయకులు

**విజయపురం, జూన్ 21 ప్రభాతవార్త:**



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ని మండల టీడీపీ నాయకులు శుక్రవారం అమరావతిలో కలసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరూ సమిష్టిగా కృషిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ

### –గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు శ్రీవారు దర్శనం

**తిరుపతిరూరల్, జూన్ 21 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గ్రామంలో గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారిని భక్తులు భక్తి శ్రద్దలతో దర్శించుకున్నారు. గరుడ వాహన సేవలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి, తుడ మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా కట్టడి లక్ష్యంగా విధులు : సిహెచ్‌ఓ

**యాదమరి, జూన్ 21 ప్రభాతవార్త:**



క్షేత్ర స్థాయిలో మలేరియా జ్వరాలు కట్టడి చేయడమే లక్ష్యంగా సిబ్బంది, ప్రజలు వుండాలని యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని కీనాటంపల్లి గ్రామంలో శుక్రవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొని సిబ్బంది, ప్రజలకు దోమల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దిల్షాద్, సచివాలయ కార్యదర్శి దివ్య, ఆశా కార్యకర్త అంజలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విప్లవాత్మకంగా రోబోటిక్ శస్త్ర చికిత్సలు

### – బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి వైద్యనిపుణులు

**చిత్తూరురూరల్, జూన్ 21 ప్రభాతవార్త:**



కృత్రిమ మేదస్సు బాగా పెరగడంతో సాంప్రదాయ శస్త్రచికిత్సల కంటే విజయవంతమైన రేటుతో తక్కువ సమస్యలతో రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి ప్రముఖ వైద్యనిపుణులు డా.ఎస్.విద్యాధర, చైర్మెన్,హెచ్‌ఓడి, వెన్నెముక శస్త్రచికిత్స మరియు కన్సల్టెంట్ లోకేష్ ఎ వీరప్ప, అర్థోపెడిక్, రోబోటిక్ కీళ్లమార్పిడి కన్సల్టెంట్ డా.కె.హేమంత్‌కుమార్‌లు తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రోబోటిక్స్ వాడకం ద్వారా స్కోలియోసిస్ దిద్దుబాట్లు, వెన్నుపూస సంబంధిత ప్లాస్టీలు, కైపోప్లాస్టీలు తదితర సమస్యలను చిన్నపాటి కోతలు కనీస కణజాల ప్రభావం, శీఘ్రంగా కోలుకొని తిరిగి సాధారణం జీవితం పొందవచ్చునన్నారు. అలాగే రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స అనంతరం నొప్పితక్కువ వుండటం, వేగవంతంగా కోలుకోవడం, అతి త్వరలో సాధారణ జీవితానికి తిరిగి రావడం జరుగుతుందన్నారు. చిత్తూరు, తిరుపతి పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి సందేహం లేకుండా రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించుకోవచ్చునన్నారు.

## ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్

**చిత్తూరు, జూన్ 21 ప్రభాతవార్త:**



శాసనసభలో శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళీమోహన్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ మేరకు నూతన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కావడంతో ఎమ్మెల్యేగా హాజరైన డాక్టర్ మురళీమోహన్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

## చంద్రబాబు విజన్ సిఎం



గౌరవసభలో అడుగుపెట్టిన సిఎం చంద్రబాబునాయుడు విజన్ ఉన్న అనుభవశాలి అని కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ అన్నారు. సిఎంగా అసెంబ్లిలో అడుగుపెట్టిన సందర్భంగా డివిజన్‌లో సంబరాలు జరుపుకున్నారు.

**ప్రభాతవార్త–తిరుపతి**

## పిఎంజే జువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

**తిరుపతి విద్య, జూన్ 21 ప్రభాతవార్త :**



పిఎంజే జులరీస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన జ్యూవలరీ ఎగ్జిబిషన్‌ను తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష శుక్రవారం ప్రారంభించారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్ వద్దనున్న పిఎల్‌ఆర్ కన్వెషన్ హాల్ వద్ద జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఎంజే క్లస్టర్ మేనేజర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో మూడు రోజుల పాటు పీఎంజే జ్యువెలర్స్ ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ హీరో మహేష్ బాబు కుమార్తె సితార అంబాసిడర్‌గా ఉన్న సితార కలెక్షన్‌ను కూడా ఇక్కడ అందుబాటులో ఉంచామని తెలిపారు. సరే కొత్త డిజైన్లతో మహిళలకు ఆకర్షించే అభరణాలను ప్రదర్శినలో విక్రయానికి ఏర్పాటు చేశామని అన్నారు. తిరుపతి మేనేజర్స్ చంద్ర, సోమశేఖర్ రెడ్డి, రషీద్, పిఎంజె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**నగరి, జూన్ 21 ప్రభాతవార్త:**



యోగా మనసు–శరీరం, వ్యక్తి సమాజం మధ్య సామరస్యాన్ని శాంతిని సాధిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలియజేశారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఏర్పాటుచేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తూ యోగా ప్రపంచానికి భారతదేశం అందించిన కానుక అని దీనిని ప్రపంచ ప్రజలందరూ పాటించినట్లయితే సమాజంలో ప్రపంచంలో అశాంతి నశిస్తుందని ఆయన తెలిపారు. కళాశాలలో విద్యార్థులు, సిబ్బందిచే ఎన్‌సీసీ డా. భాస్కర్ యోగాసనాలు వేసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ డా. భాస్కర్‌రాజు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డా. ఇందిరా ప్రియదర్శిని, సుబ్రహ్మణ్యం, డా.పంకజ, రేవతి, మహేశ్వరి, సుహాసిని, గిరీష్, కుమార్, శ్రీలక్ష్మి, రమేష్, నవీన్, నరసయ్య, ఉమామహేశ్వరి, శ్రీరామాంజులు, ప్రేమ్‌కుమార్, జ్యోతి, సురేష్, హరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ

**నగరి, జూన్ 21 ప్రభాతవార్త:**



నగరి మున్సిపాలిటీ టీఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో 45 మంది విద్యార్థి విద్యార్థులకు భోజన సౌకర్యం స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. పాఠశాలలో విద్యను బోధించు ఉపాధ్యాయురాలు సుజాత పిల్లలకు భోజనం చేసే ప్లేట్లు లేకపోవడంతో దాతృత్వంతో స్కూలులోని పిల్లలకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. పిల్లలకు ఏవైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని కౌన్సిలర్ రామకృష్ణ తెలిపారు. నగరి మున్సిపల్ రిటైర్డ్ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ మాజీ కార్యదర్శి లోకేంద్ర బాబు, టీడీపీ నాయకులు జ్యోతినాయుడు, గుణశేఖర్, కేశవులు, రమేష్‌బాబు, కిషోర్ పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో జవాబుదారి తనంతో పని చేయండి: ఎస్‌సి

**శ్రీకాళహస్తి,జూన్ 21 ప్రభాతవార్త :**



విధి నిర్వహణలో జవాబుదారి తనంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందని జిల్లా అదనపు ఎస్‌సి కులశేఖర్ అన్నారు.శుక్రవారం పట్టణ పొలిమేరల్లోని ఆర్‌జివి కళ్యాణమండపంలో పోలీసుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి డివైయస్‌పి బి.ఉమామ హేశ్వరరెడ్డి సారథ్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కులశేఖర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా తిరుపతి జిల్లా ఎపోలీసుల పనితీరు స్ఫూర్తిదాయమన్నారు. భవిష్యత్తులోకూడా ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని ప్రజల మన్ననలందుకోవాలన్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన హోంగార్డు నుంచి ఆఫీసర్ స్థాయి వరకు సేవలందించిన ఉద్యోగులకు అదనపు ఎస్‌పి కులశేఖర్, డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి,రేణిగుంట డివైయస్‌పి భవ్యకిషోర్‌లు స్వతహాగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి సేవలందించారు.

## ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేసిన బొజ్జల

**శ్రీకాళహస్తి,జూన్ 21 ప్రభాతవార్త :**




శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి 43వేలు పై చిలుకు మెజారిటితో ంగెలుపొందారు. శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వెంకట సుధీర్‌రెడ్డి తన తండ్రి పేరు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రస్తావిస్తూ ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేసారు.తరువాతముఖ్యంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వచనాలుఅందుకున్నారు.యువనాయకుడు నారా లోకేష్‌ను ఆలింగనం చేసుకున్నారు. ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరితోకరచాలనంచేసిఆశీర్వచనాలనుఆందుకున్నా రు.

## బడిఈడు పిల్లలందరు బడిలోనే ఉండాలి..ఎంఈవో

**తొట్టంబేడు, జూన్ 21 ప్రభాతవార్త :**



బడిఈడు పిల్లలందరు బడికి వెళ్ళాలని శ్రీకాళహస్తి మండల విద్యాశాఖాధికారులు భువనేశ్వరి, బాలయ్యలు అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని టిఎంవీ కండ్రిగ గ్రామంలో శుక్రవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలను బడిలో చేర్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిఈడు పిల్లలందరినీ తప్పక బడికి పంపేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సిఆర్పీ ప్రదీప్‌కుమార్, మునిమోహన్, స్వప్న, గాంధీ, ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న దారునాయక్

**శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త :**



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్లను రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు యం.దారునాయక్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.ఈసందర్భంగా ఆలయ దక్షిణగోపురం వద్ద రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ మరియు తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి బాలాజీనాయక్, తిరుపతి పార్లమెంటు ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : డాక్టర్ చంద్రప్ప

**శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త :**



యోగాతోనే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని నేటి యువతకు యోగా ఎంతో అవసరమని తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు, యోగా గురువు డాక్టర చంద్రప్ప అన్నారు. కార్యక్రమంలో గురుదేవ్, పసుపులేటి ఆనంద్, భాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ, నాగప్రసాద్, ఏడుకొండలు, మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యా సామగ్రి వితరణ



**విజయపురం, జూన్ 21 ప్రభాతవార్త:** మండలంలోని ఆలపాకం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకులు శరవణ విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు శివలింగం, పురుషోత్తం, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం ప్రమాణస్వీకారంతో సంబరాలు

**నారాయణవనం, జూన 21 ప్రభాతవార్త :**



ఎపి ముఖ్యమంత్రిగా నాల్గవసారి నారా చంద్రబాబు నాయుడు, సత్యవేడు టిడిపి ఎమ్మెల్యేగా రెండవసారి కోనేటి ఆదిమూలం గెలిచి శుక్రవారం అసెంబీల్లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా కాల్చి, కేక్‌లు కట్ చేశారు.

## తిరుచ్చివాహనంపై పద్మావతీదేవి అమ్మవారు

**నారాయణవనం, జూన్ 21 ప్రభాతవార్త :**



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## ఆలయాల్లో ఘనంగా పౌర్ణమి పూజలు

**నారాయణవనం, జూన్ 21 ప్రభాతవార్త :**



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను పౌర్ణమి పూజలను ఘనంగా జరిపారు.

## ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### –స్వర్ణముఖీలోకి ట్రాక్టర్లు వెళ్ళకుండా ట్రెంచ్‌లు

**తిరుపతిరూరల్, జూన్ 21 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలంలో ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేసారు. స్వర్ణముఖీ నదీపరివాహక ప్రాంతంలోకి ట్రాక్టర్లు వెళ్ళకుండా జెసిబితో గుంతలు కొట్టారు. తిరుపతిరూరల్ మండలం చిగురువాడ, దుర్గసముద్రం, గొల్లపల్లి స్మశానం, అడపారెడ్డిపల్లి తదితర ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా గుంతలు కొట్టారు. తిరుపతిరూరల్ మండల ఇన్‌చార్జి తహశీల్దార్ మారుతి ఆదేశాల మేరకు మండలంలో ఇసుకదోపిడిని అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రవీంద్ర, రమేష్, ద్రాక్షయణి, మహిళా పోలీసు రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పులివర్తి నాని అనే నేను...

### –అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన పులివర్తి నాని

**తిరుపతిరూరల్, జూన్ 21 ప్రభాతవార్త:**



పులివర్తి నాని అనే నేను... శాసనసభ సభ్యునిగా పులివర్తి నాని ప్రమాణస్వీకారం చేశారు. అసెంబ్లీ సమావేశాలలో మొదటగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్‌తో ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేయించారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి 30 యేళ్ల అనంతరం తెలుగుదేశం పార్టీ తరపన పులివర్తి నాని అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో సర్వత్ర ప్రసంశలు అందుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రమాణస్వీకారం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, డిప్యూటీ సి.యం. పవన్ కళ్యాణ్‌ను, మంత్రి లోకేష్‌బాబును కలిసి అభినందనలు తెలిపారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్నాం



**తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:**

ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం వేకువజామున ప్రముఖులు దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు, ఎంపి బాలశౌరి, టిటిడి ఈఓ శ్యామలరావు కుటుంబంతో శ్రీవారిని అబిషేకసేవలో దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## చంద్రబాబు గౌరవసభలో అడుగు...రాష్ట్ర అభివృద్ధికి ముందడుగు

**తిరుపతి,జూన్ 21ప్రభాతవార్త:**



అనుభవశాలి, ముఖ్యమంత్రిగా ప్రజల అభీష్టం మేరకు పాలనసాగించే హుంధానాయకుడు నారా చంద్రబాబునాయుడు మళ్ళీ గౌరవసభలో అడుగుపెట్టడం శుభకరమని టిడిపి నేతలు అన్నారు. రెండున్నరేళ్ళ తరువాత ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుపతిలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నేతలు సుగుణమ్మ, వట్టికుంట శంకరనారాయణ, శ్రీధర్‌వర్మ, మహేవ్‌యాదవ్, కంకణాల రజినీకాంత్‌నాయుడు, బుల్లెట్‌రమణ, దంపూరి భాస్కర్, మన్నెంశ్రీనివాసులు, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, అధ్యక్షులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయి నుండి యోగా నేర్చుకోవాలి

**తిరుపతి విద్య, జూన్ 21 ప్రభాతవార్త :**



స్థానిక వరదరాజు నగర్ శ్రీపురం కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జోనల్ ఇంచార్జ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేసి అందరిని ఆకర్షింప చేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ఇన్చార్జి సుధా కుమార్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**తిరుపతి విద్య, జూన్ 21, ప్రభాతవార్త :**



స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న న్యూ బాలాజీ కాలనీలో గల భాష్యం బృహస్పతి క్యాంపస్ నందు జోనల్ ఇన్చార్జి లక్ష్మణ రావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ప్రిన్సిపాల్ నేతాజీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

**నగరి, జూన్ 21 ప్రభాతవార్త:**



బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక పాఠశాల కాకవేడులో వారు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 సంవత్సరాలు వయసున్న ప్రతి ఒక్కరు బడిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,**Goturi Murali Mohana Reddy,** (old Name) R/o, 1-118, Mangalampeta Road, Pulicherla Chittor Dt Ap. I Have Changed My Name as **GOTURI MURALI MOHAN REDDY** (new name), S/O GOTURI CHENGA REDDY.

# చంద్రబాబు శపథం నెరవేరిన రోజు

## -దేశం నాయకులను సత్కరించిన జనం

పుంగనూరు,జూన్ 21 ప్రభాతవార్త :
నారా చంద్రబాబునాయుడు రాష్ట్రముఖ్య మంత్రిగా అసెంబ్లీలో అడుగుపెడుతానని చేసిన శపథం నెరవేరిన సందర్భంగా పుంగనూరులో దేశంశ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నాయి.దేశం నాయకులు సి.విరెడ్డి,రామకృష్ణమరాజు, దినేష్,సయ్యద్ సుహేల్‌బాషాలను ఈసందర్భంగా పార్టీశ్రేణులు ఘనంగా సత్కరించాయి. ఈసందర్భంగా నాయకులు సివి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తమ పరిపాలన సాగించే దిశగా శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సీనియర్ నాయకుడు ఎం.రామకృష్ణమరాజు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం ప్రజలు ఎంతో



ఆనందంగా ఉన్నారని, చల్లారామచంద్రారెడ్డి, వెంకరటమణ రాజుల నేతృత్వంలో పుంగనూరుకు మంచి రోజులు రానున్నాయన్నారు. సీనియర్ నాయకుడు దినేష్ మాట్లాడుతూ ఇంతకాలం కౌరవుల పాలన ఎలా ఉంటుందో చూపించి, ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపించిన జగన్‌ను ప్రజలు ఇంటికి పంపించారన్నారు. సయ్యద్ సుహేల్ మాట్లాడుతూ ఇంతకాలం పుంగనూరులో అరాకం సృష్టించి, ప్రజలను అడవులపాలు చేసిన వైకాపాకు ఇది చరమదశ అన్నారు.కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి 9 గేదెలు మృతి!

చిల్లకూరు, జూన్ 21 ప్రభాతవార్త :



చిల్లకూరు మండల పరిధిలోని ముత్యాలపాడు చెరువులో విద్యుత్ తీగలు తగలి 9 గేదెలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తిమ్మనగారిపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెడ్డి, జనార్ధన్ రెడ్డి, యానాది రెడ్డి, సుమన్‌లకు చెందిన 9 గేదెలు మృతి చెందాయి. సుమారు వీటి విలువ 4.5 లక్షల రూపాయిలు వరకు ఉంటుందన్నారు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి, మరమ్మత్తులు చేపట్టి మూగజీవాల ప్రాణాలను కాపాడాలన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి,జూన్ 21ప్రభాతవార్త:



యోగాకు సమయపాలన లేదని, యోగాతో సంపూర్ణఆరోగ్యం సిద్దిస్తుందని బిజెపి గంగమ్మగుడి శక్తి ఇన్‌ఛార్జి గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. ప్రతి మనిషి తన దైనందిక జీవితంలో యోగాను అంతర్భాగం చేసుకున్నపుడే ఆరోగ్యవంతుడవుతాడని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం తిరుపతి బిజెపి నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి మాస్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. యోగా విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, తిమ్మిశెట్టి చంద్రశేఖర్, ప్రసాద్, రమణప్ప, కల్యాణి, శాంబోలు హరినాథ్, కళావతి, ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంయాదవ్ తదితరులు పాల్గోని యోగా విన్యాసాలు ,ఆసనాలు చేశారు.

## పుత్తూరు సిద్దార్థలో జాతీయ యోగ దినోత్సవ వేడుకలు

నారాయణవనం, జూన్ 21 ప్రభాతవార్త :



మండలంలో వెలసిన సిద్దార్థ ఇంజనీరింగ్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గత వారం రోజులుగా యోగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రాజు, రమేష్ యోగ అనేది ప్రతి మనిషి యొక్క నిత్య జీవితంలో బాగమన్నారు. ప్రతి యోగ చేయడం వల్ల మనిషి ఆరోగ్యంగా వుంటాడన్నారు. గత వారం రోజులుగా అధ్యాపకులకు యోగపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ మేరకు వారి కుటుంబ సభ్యులకు యోగ నేర్పించడం వల్ల వారు కూడా ఆరోగ్యంగా వుంటారన్నారు. ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు మాట్లాడుతూ యోగ చేయడం వల్ల అనారోగ్యభారి నుంచి మనలను మనం కాపాడుకోవచ్చున్నారు. యోగ చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా వుంటారన్నారు. మెదడు బాగా పని చేస్తుందన్నారు. దీని వల్ల చాలా రోగాలకు స్వస్తి చెప్పవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో యోగ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఒడిలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాశింప్రమాణ స్వీకారం వేళ...

### గూడూరులో మిన్నంటిన సంబరాలు

గూడూరు, జూన్ 21 ప్రభాతవార్త :



స్థానికుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధిని ఆకాంక్షించే డాక్టర్ పాశం సునీల్ కుమార్ గూడూరు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారోత్సవం చేస్తున్న సందర్భంగా గూడూరు నియోజకవర్గ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని శ్రీ ధర్మరాజు దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ వాటాంబేడు శివకుమార్ అన్నారు. వాటాంబేడు బ్రదర్స్ ఆధ్వర్యంలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా గూడూరు పట్టణం పాత బస్టాండ్ సెంటర్ వద్ద టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. నేడు రాష్ట్ర అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద వాటాంబేడు బ్రదర్స్ ఆధ్వర్యంలో ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేసి రాష్ట్ర అసెంబ్లీలో జరుగుతున్న శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నులపండువగా ఊంజల్‌సేవ

### -పరవశించిన భక్తజనం

శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి నెలా పౌర్ణమి రోజు నిర్వహించే ఊంజల్‌సేవను ఆదివారం ఆలయంలో కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి,అమ్మ వార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయం వెలుపల ఉన్న మండపం వద్ద ఎదురెదురుగా ఆశీనుల్నిచేసి ఊంజల్‌సేవను నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రోచ్చారణల మద్య ఊంజల్‌సేవను కార్యక్రమానికి పలువురు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎస్వి నాగేశ్వరరావు దంపతులు, పలువురు వేదపండితులుతోపాటు భక్తులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా ఓవైపు వేదపండితులు వేదమంత్రోచ్చారణల మద్య ఊంజల్‌సేవలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశేషసంఖ్యలో హాజరయ్యారు.

## నాణ్యమైన నెయ్యితో...రుచికర శాంపిల్ లడ్డూలు

### -పోటు కార్మికులకు టిటిడి ఈఓ శ్యామలరావు సూచన

తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:



నాణ్యమైన నెయ్యి, శనగపిండి, యాలకులు ఉపయోగించి మరింత రుచికరంగా లడ్డూల శాంపిల్స్ తయారుచేసి,నాణ్యతను పరిశీలించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు పోటు కార్మికులకు సూచించారు. లడ్డూ తయారీలో ఉన్న సమస్యలు, నాణ్యతా లోపంపై వస్తున్న విమర్శలకు గల కారణాలను ఆయన శుక్రవారం ఉదయం టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, ఏఈఓ పోటు శ్రీనివాసులు, విశ్రాంత ఏఈఓలు శ్రీనివాసన్, వసంతరావుతో కలసి ఈఓ శ్యామలరావు సమీక్షించారు.పోటు కార్మికులతోకలసి లడ్డూల తయారీ, నాణ్యతపై సమీక్షించారు.

## ప్రథమ మహిళా ఎమ్మెల్యేగా విజయశ్రీ ప్రమాణ స్వీకారం

సూళ్లూరుపేట, జూన్ 21 ప్రభాతవార్త :



సూళ్లూరుపేట శాసనసభ నియోజకవర్గ ప్రప్రథమ మహిళా ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీ శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. సూళ్లూరుపేట శాసనసభ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నెలవల విజయశ్రీ 29,115 ఓట్ల మెజార్టీతో గెలుపొంది అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గ చరిత్రలో మహిళా ఎమ్మెల్యేలుగా అభ్యర్థులు పోటీ చేసినప్పటికీ వారెవరూ విజయం సాధించలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన నెలవల విజయశ్రీకి పలువురు అభినందనలు తెలిపారు. తిరుపతి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, ప్రధాన కార్యదర్శులు ఎజి కిషోర్, పాకం వెంకటసుబ్బయ్య, బిసి నాయకులు చిట్టేటి పెరుమాళ్ల తదితరులు విజయశ్రీని అభినందించారు. నియోజకవర్గానికి సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 800గడ్డివాములు దగ్ధం-రూ.1.50లక్షలు నష్టం

.తొట్టంబేడు, జూన్ 21 ప్రభాతవార్త



మండలంలోని చేమూరులో నివాసం ఉంటున్న ధనయ్యకు చెందిన 800గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు భాదితుడు వాపోయాడు. ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడం సంతోషం. సుమారు రూ.1.50లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలపగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## శుభాకాంక్ష తెలిపిన వారికి ధన్యవాదాలు:కోలా

శ్రీకాళహస్తి,జూన్ 21 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలో జరిగిన తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన అభిమానులకు కోలా ఆనంద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాళహస్తిలో రాజకీయ నాయకుల్లో యువకుడై కోలా ఆనంద్ కుమార్ ఎల్లవేళల్లో జనాలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపే నాయకుడు. ఎవరైనా సరే ఆయన వద్దకు వచ్చి తాను సమస్యల్లో ఉన్నానంటే తోడుగా వచ్చే మనస్తత్వం కల్గిన నాయకుడు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా, మున్సిపల్ కౌన్సిలర్‌గా ఆయన సమర్థవంతంగా పరిపాలించారు. ప్రస్తుతం బిజెపి నాయకుడుగా గత ఐదేళ్ళుగా పార్టీ సభ్యత్వాలను చేర్పటంలో విజయం సాధించారు.ఈ సారి తనకే ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం అని భావించారు.కానీ వివిధ సమీకరణల దృష్ట్యా ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థికి అవకాశం వచ్చింది.ఈ నేపథ్యంలో పార్టీ విజయానికి కృషి చేసారు. ఈనేపథ్యంలో శుక్రవారం వన్నెకుల క్షత్రియులకు సంబంధించిన మప్పెటి సుబ్రమణ్యంరెడ్డితో పాటు ఆయన సహచరులు సుధాకర్‌రెడ్డి,నాగరాజురెడ్డి, ఏర్పేడు మండలం నాగం పల్లి గ్రామానికి చెందిన నాగం పల్లి మధురెడ్డి, నాగపల్లి వెంకటస్వామిరెడ్డి, గోపాల్, మాజీ కౌన్సిలర్ చిర్రినాగేశ్వరరావు వారి సహచరులతో కలసి కోలా ఆనంద్ సారధ్యంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్‌ను కలువ గజ మాలతో సత్కరించారు.

## కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నిరసన

శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త



నేడు ఆలిండియా కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నీట్ పరీక్షల పరీక్షాపత్రం లీక్ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.బత్తెయ్యానాయుడు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయం అన్నారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ పదే పదే ప్రశ్నించిన మోడీ స్పందచలేదని రాబోవు ఈనెల 24న జరగబోయే పార్లమెంటులో దీని గురించి కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇండియాకూటమి నాయకులతో కలసి నిలదీస్తారని తమ నాయకులు రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వెంకటముని,గోపి,సురేష్,మోహన్,నాగూరయ్య,వానమ్మ,బానమ్మ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో శారీరక..మానసికోల్లాసం సాధ్యం

### - పిఇఎస్ వైద్యకళాశాల డీన్ డా॥ కృష్ణారావు

కుప్పం, జూన్ 21 ప్రభాతవార్త :



యోగాతో శారీరక, మానసికోల్లాసం సాధ్యమని పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం పిఇఎస్ ఆడిటోరియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీన్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాల కోసం రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగాతో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవచ్చని అలాగే ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు. ఈసందర్భంగా యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో అన్ని కోర్సుల విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'నీట్' విద్యార్థులకు న్యాయం చేయండి..వడ్లతాంగల్

శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త



నీట్ 2024 రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఏపి బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే నిర్లక్ష్యం కారణంగా వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఎన్డీయే నిర్లక్ష్యం కారణంగానే బీహార్లో నీట్ 2024 ప్రశ్నాపత్రం లీక్ చేశారన్నారు. ఇందుకు కేంద్ర ప్రభత్వం బాధ్యత వహించాలని వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎవరో చేసిన పనికి దేశ వ్యాప్తంగా నీట్ 2024 రాసిన విద్యార్థులు అందరు ఇబ్బందులకు గురవుతున్నారని నీట్ ప్రశ్నాపత్రం లీక్ చేయించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలుతీసుకోవాలన్నారు. ఇందులో భాగస్వాములైన విద్యార్థులను సైతం ఒక ఏడాది పాటు పరీక్షలు రాయకుండా డీబార్ చేయించాలన్నారు. అర్ధరహితంగా గ్రేస్ మార్కులు కలిపిన అధికారులపై కూడా చర్యలుతీసుకోవాలన్నారు. నిజాయితీగా పరీక్షలు రాసిన విద్యార్థులకు యధాతథంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు.

## శ్రీసిటీలో వేడుకగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

సత్యవేడు, జూన్ 21 ప్రభాతవార్త:





శ్రీసిటీలో శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత వేడుకగా ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్థానిక విజిటర్స్ సెంటర్ ఆవరణలో జరిగిన యోగా కార్యక్రమంలో సుమారు 250 మంది పాల్గొన్నారు. భారతదేశంలో ప్రారంభమైన పురాతన అభ్యాసన యోగాను ప్రోత్సహిస్తూ ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఈ సందర్భంగా సన్యాసరావు పేర్కొన్నారు. యోగా దినాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో యోగా ప్రాచీన భారతావని మానవాళికి అందించిన అమూల్య బహుమతి అని పేర్కొన్నారు. యోగా కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు సెజ్ కార్యాలయ సిబ్బంది, స్థానిక పోలీసులు, చిన్మయ, అకార్డ్ స్కూలు విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చక్కటి ఆరోగ్యానికి యోగా కీలకసాధనం

### - కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ బిసి నాగరాజ్

కుప్పం, జూన్ 21 ప్రభాతవార్త :



చక్కటి ఆరోగ్యానికి యోగా కీలకసాధనమని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కెఇసిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాసనాలతో శరీరంలో సమతుల్యత కల్పించడం, జీర్ణక్రియమెరుగుపడడం, అలసత్వం తగ్గడం జరుగుతాయన్నారు. అలాగే హృదయ స్పందన సైతం మెరుగుపడుతుందన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలకు యోగాతో పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా స్వయంగా ఆయన యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ గణేష్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాధవన్, గంగాధర్, హెచ్ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏను సత్కరించిన బిజె ప్రసాద్

తొట్టంబేడు, జూన్ 21 ప్రభాతవార్త



తెలుగునాడు రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ బిజె ప్రసాద్ ఎంఎల్‌ఏగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాగా పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్, పౌరసరఫరాల శాఖ మంత్రి బోండా ఉమా, పుట్టపర్తి ఎంఎల్‌ఏ పల్లెసిందూరారెడ్డి, చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్మోహన్‌లను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శివయ్య తీర్థప్రసాదాలు అందించారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త :



యోగాతోనే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతుల వుతారని అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి నియోకజవర్గ అసెంబ్లీ కన్వీనర్ కోలా.ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి ఆధ్వర్యంలో కోలా.ఆనంద్ కుమార్ తన పార్టీ కార్యకర్తలు నడుమ యోగా ప్రక్రియ చేపట్టారు. వివిధ యోగా భంగిమల్లో యోగా ప్రక్రియలు పూర్తయింది. అనంతరం విద్యా స్వరూపానందగిరి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి పూలమాల వేసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం, పట్టణ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు, సొట్టసుకుమార్, జివిఅమర్నాద్, కొండేటిగోపాల్, మద్దువాసుయాదవ్, కె.హరీష్‌రెడ్డి, పుణ్యం డిల్లీకుమార్, ప్రసాద్, ప్రతాప్, సజ్జలహరీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డా... నీటి కుంట!

శ్రీరంగరాజపురం, జూన్ 21 ప్రభాతవార్త:



మనం ఈ చిత్రంలో చూస్తున్నది మంచినీటి కుంట కాదు! సాక్ష్యాత్తు సిమెంటు రోడ్డు! ఇది ఎక్కడ వుందంటే శ్రీరంగరాజపురం మండల పరిధిలలోని కొత్తపల్లిమిట్ట నుండి వివిపురం మీదుగా సిద్దేశ్వరకొండకు వెళ్తున్న రోడ్డు. రహదారి నిర్మించాలనే ధ్యాసతో మట్టి రోడ్డుగా వున్న ఈ దారిని సిమెంటు రోడ్డుగా మార్చారు. అయితే సిమెంటు రోడ్డు నిర్మాణ క్రమంలో అక్కడ వున్న ఒక చిన్న డ్యామ్ నిర్మించకుండా దానిని అలాగే వదలి వేయడంతో గ్రామంలోని వర్షపు నీరు మొత్తం అక్కడికి చేరి సిమెంటు రోడ్డును కుంటగా మార్చివేసింది. చిన్నపాటి వర్షం కురిసినా సిమెంటు రోడ్డులో కుంట తరహాలో వర్షపు నీరు నిల్వ వుండిపోతుంది. ఫలితంగా ఇక్కడ దోమలు వృద్ధి చెంది నీళ్ళు కుళ్ళి దుర్వాసన వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కావడంతో స్థానిక నాయకులు సూరిరెడ్డి, సర్పంచ్ డివి ఢిల్లీయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, మోగేశ్వరనాయుడు, సాయి తదితరులు ఈ ప్రాంతంను పరిశీలించారు. ఈ ప్రభుత్వం అయినా ఏళ్ళ తరబడి వున్న ఈ సమస్యను పరిష్కరిస్తుందా! లేదా! చూడాల్సి వుంది.

## కన్నులపండువగా అమ్మవారి తిరుచ్చివాహనసేవ

శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తి జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎస్వి నాగేశ్వరరావు దంపతులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్దలతో ముచ్చివోలులో పాండురంగ స్వామి తిరునాళ్ళు

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 21 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో శుక్రవారం కన్నుల పండువగా పాండురంగ స్వామి తిరునాళ్ళు జరుగుతుంది. గ్రామంలో ఇదో పండగలా నిర్వహించటం ఆనవాయితి. ముచ్చివోలులో పాండురంగస్వామి తిరునాళ్ళు సందర్భంగా నిర్వహించే అగ్నిగుండం కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చారు. గ్రామంలో పండగ వాతావరణం కల్పించారు. ఊరంతా మామిడి తోరణాలతో ముస్తాబు చేసారు. అరటి చెట్లతో తీర్చిదిద్దారు.ఈ కార్యక్రమాలకు ఎంఎల్‌సి డాక్టర్



సిపాయి సుబ్రమణ్యం,శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేర్వేరుగా తమ సహచరులతో గ్రామస్థుల పిలుపు మేరకు హాజరయ్యారు. ఈకార్యక్రమాల్లో రాఘవయ్య, యుగంధర్, మునిరెడ్డి,సుబ్రమణ్యం, జనార్థన్, వెంకటరాఘవులు, సుబ్రమణ్యం, కృష్ణమనాయుడు, వెంకటరామానాయుడు,నాయుడు తదితరులు పాల్గొన్నారు. అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు పట్టణ ప్రముఖుల గిరిప్రసాద్,కొళ్ళూరు హరినాయుడు,తేజు, సుధీర్,సాయి తదితరులు హాజరై పాండురంగస్వామిని దర్శించుకొని పూజలుజరుపుకున్నారు.

## బంగారుకవచంలో మలయప్ప ఉత్సవర్లు

### -శాస్త్రోక్తంగా ముగిసిన జ్యేష్టాభిషేకాలు



తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:
కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు అభిషేకాలతో అరిగిపోకుండా పరిరక్షణకు నిర్వహించిన జ్యేష్టాబిషేకాలు శుక్రవారం మధ్యాహ్నం శాస్త్రోక్తంగా ముగిశాయి. చివరిరోజు శుక్రవారం అభిదేయక అబిషేకం నిర్వహించారు. సాయంత్రం బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులు ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.